విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చూడాలి


సమావేశంలో వివరాలు అడిగి తెలుసుకుంటున్న ఎస్ఈ ఖాజా అబ్దుల్ రెహ్మాన్

చార్మినార్: విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా రౌండ్ ది క్లాక్ విద్యుత్ సేవలను అందించడానికి సిబ్బంది, అధికారులు ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలని టీఎస్ ఎస్పీడీసీఎల్ దక్షిణ మండలం ఎస్ఈ ఖాజా అబ్దుల్ రెహ్మాన్ సిబ్బందికి సూచించారు. శనివారం ఆయన చార్మినార్ డీఈ పరిధిలోని అధికారులు, సిబ్బందితో అత్యవసర సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..విధినిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే శాఖ పరమైన చర్యలు తప్పవన్నారు. వేసవి కాలంతో పాటు రాబోయే రంజాన్ మాసం సందర్భంగా ఎక్కడైనా సాంకేతిక కారణాలతో విద్యుత్ సరఫరా సమస్యలు తలెత్తితే వెంటనే ఏఈ స్థాయి అధికారి వెంటనే స్పందించి క్షేత్రస్థాయి పరిశీలన చేసి విద్యుత్‌ను పునరుద్ధరించాల్సిన అవసరం ఉందనే విషయాన్ని సిబ్బందికి వివరించారు. సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు విద్యుత్ సీఎండీ ముషారఫ్ ఫారుఖీ ఎప్పటికప్పుడు విద్యుత్ సమస్యలపై మానిటరింగ్ చేస్తున్నారని.. సిబ్బంది అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజల నుంచి అందిన ఫిర్యాదుల పట్ల వెంట వెంటనే స్పందించాలన్నారు.

ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి


కమిషనర్‌ను కలిసిన రావుల ప్రదీప్‌కుమార్‌రెడ్డి, మహ్మద్ రహ్మత్‌అలీ తదితరులు

అబిడ్స్: వాణిజ్య పన్నుల శాఖలో ఉద్యోగుల సమస్యలన్నీ పరిష్కరించేందుకు కృషి చేస్తానని కమిషనర్ టీకే.శ్రీదేవి పేర్కొన్నారు. వాణిజ్య పన్నుల శాఖ ఎన్జీఓల కేంద్ర సంఘం అధ్యక్షుడు రావుల ప్రదీప్‌కుమార్ రెడ్డి, అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి మహ్మద్ రహ్మత్‌అలీ ఇతర నాయకులు హరిప్రసాద్, దేవులపల్లి శ్రీనివాసరావు బృందం కమిషనర్‌ను కలిసి ఉద్యోగుల సమస్యలు వివరించారు. ఈ సందర్భంగా కమిషనర్ శ్రీదేవి మాట్లాడుతూ..పదోన్నతులతో పాటు ఇతర సమస్యలను కూడా త్వరితగతిన పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో మధు, రవీంద్రబాబు, రాజు, శ్రీరామ్, కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి


చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కౌసర్

గోల్కొండ: అర్హులందరూ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్ అన్నారు. శనివారం ఆయన కార్వాన్ నియోజకవర్గానికి చెందిన పలువురు లబ్ధిదారులకు మంజూరైన షాదీముబారక్, కల్యాణ లక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పదేళ్లుగా పేదలకు వలస కూలీలు, నిరుద్యోగులకు అండగా ఉంటున్నామన్నారు. అదే విధంగా మహిళా పొదుపు సంఘాల స్థాపనకు తమ పార్టీ అండగా ఉంటూ మహిళలను ప్రోత్సహించిందన్నారు. మజ్లిస్ పార్టీ సీనియర్ నాయకులు హారూన్‌ఫరాన్, నానల్‌నగర్ కార్పొరేటర్ మహ్మద్ నసీరుద్దీన్ తదితరులున్నారు.

షబ్-ఏ బరాత్, రంజాన్ నేపథ్యంలో ఏర్పాట్లు చేయండి


సమావేశంలో ఎమ్మెల్యే జాఫర్ హుస్సేన్ మేరాజ్

యాకుత్‌పురా: షబ్-ఏ బరాత్, రంజాన్ మాసం నేపథ్యంలో ప్రజలకు అన్ని ఏర్పాట్లు చేయాలని ఎమ్మెల్యే జాఫర్ హుస్సేన్ మేరాజ్ పలు విభాగాల అధికారులకు సూచించారు. ఉపవాలస దీక్షలను పురస్కరించుకొని శనివారం ఆయన కార్పొరేటర్లు, పలు విభాగాల అధికారులతో జీహెచ్ఎంసీ కార్యాలయంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ..షబే-ఏ బరాత్ సందర్భంగా శ్మాశన వాటిలోని పూర్వీకుల సమాధులకు ప్రార్థనలు చేసేందుకు వచ్చే వారికి ఎలాంటి ఇబ్బందులు రాకుండా చర్యలు తీసుకోవాన్నారు. రంజాన్ మాసం నేపథ్యంలో అన్ని మసీదుల వద్ద మరమ్మతు పనులు చేపట్టాలన్నారు. ఈ సమావేశంలో రెయిన్‌బజార్, డబీర్‌పురా, తలాబ్ చంచలం, సంతోష్‌నగర్, మొఘల్‌పురా, పత్తర్‌గట్టీ కార్పొరేటర్లు మహ్మద్ వసీవుద్దీన్, అలాందార్ వాలాజాహి, డాక్టర్ సమీనాబేగం, ముజఫర్ హుస్సేన్, నస్రీన్ సుల్తానా, సయ్యద్ సోహెల్ ఖాద్రీ, సంతోష్‌నగర్ సర్కిల్ ఈఈ ఏకాంబరం, ఎంటమాలజీ ఎస్ఈ శ్రీనివాసులు పాల్గొన్నారు.

మాజీ సీఎం కేసీఆర్‌పై సీబీఐ, ఈడీ విచారణ జరిపించాలి


మాట్లాడుతున్న రవీంద్రనాయక్

సుల్తాన్‌బజార్: మాజీ సీఎం కేసీఆర్ రాష్ట్రాన్ని దోచుకున్న తీరు, లక్షల కోట్ల అవినీతిపై ఇటీవల కాగ్ ఇచ్చిన రిపోర్ట్ ఆధారంగా విచారణ జరిపించి అరెస్టు చేయాలని కేంద్ర హోంశాఖ మంత్రి, సీబీఐ డైరెక్టర్, కేంద్ర విజిలెన్స్ శాఖ మంత్రికి వినతిపత్రం అందజేసినట్లు తెలంగాణ రాష్ట్ర బీజేపీ కోర్ కమిటీ సభ్యుడు, మాజీ ఎంపీ డి.రవీంద్రనాయక్ డిమాండ్ చేశారు. శనివారం హైదర్‌గూడలోని ఎన్ఎస్ఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేసీఆర్, ఆయన కుటుంబం, ఆయన అనుచరులు లక్షల కోట్ల రూపాయాల రాష్ట్ర ఖజానా, వేల ఎకరాల భూములను దోచుకున్నారని ఆరోపించారు. అసైన్డ్, మిగులు, వక్ఫ్, దేవాలయం, శరణార్థులు, గౌథాన్, భూదాన్, నయీం, మియాపూర్, ఈడీ భూములను క్విడ్-ప్రో ప్రాతిపదికన, తెలంగాణను ఆర్థిక సంక్షోభంలోకి నెట్టడం కాగ్ నివేదిక, వార్తా పత్రికలు నిరంతరం స్పష్టమైన పత్రాలతో బహిర్గతం చేస్తున్నాయన్నారు.

గిరిజన క్రీడాకారులకు ప్రోత్సాహం


క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న మాజీ ఎమ్మెల్సీ రాములు నాయక్

గన్‌ఫౌండ్రీ: రాష్ట్రంలోని గిరిజన క్రీడాకారులను ప్రోత్సహించడానికి రాష్ట్ర వ్యాప్తంగా సేవాలాల్ మహారాజ్ క్రీడాపోటీలను నిర్వహిస్తున్నట్లు మాజీ ఎమ్మెల్సీ రాములు నాయక్ తెలిపారు. శనివారం ఎల్బీస్టేడియంలో మూడు రోజుల పాటు జరుగనున్న సేవాలాల్ మహారాజ్ క్రికెట్ టోర్నమెంట్‌ను ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ..రాష్ట్ర వ్యాప్తంగా 33 జిల్లాలో గిరిజన క్రీడాకారుల కోసం క్రికెట్, కబడ్డీ, వాలీబాల్, ఖోఖో, వెయిట్‌లిఫ్టింగ్, కుస్తీ పోటీలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈనెల 26న జరిగే ఫైనల్ పోటీలకు సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు పొన్నం ప్రభాకర్, సీతక్క, మాజీ ఎంపీ వి.హన్మంతరావు హాజరవుతారని తెలియజేశారు. ఈ పోటీలలో గెలుపొందిన వారికి రూ.లక్ష నగదు బహుమతి, ద్వితీయ బహుమతిగా రూ.50 వేల నగదునున అందజేస్తున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు చిన్న శ్రీశైలం యాదవ్, శ్రీకాంత్ గౌడ్, ఐఆర్ఎస్ అధికారి చిరు నాయక్, జీహెచ్ఎంసీ జోనల్ కమిషనర్ మోహన్ సింగ్ నాయక్, సీటీఓ భీష్మా నాయక్, నిర్వాహకులు రాజేందర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

వేతన సవరణ కోసం పెన్షనర్ల వినతి


కమిషనర్‌కు వినతిపత్రం అందిస్తున్న నర్సయ్య తదితరులు

నాంపల్లి: పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తెలంగాణ పెన్షనర్స్ కేంద్ర సంఘం నేతలు శనివారం వేతన సవరణ కమిటీ కమిషనర్‌కు అందజేశారు. ఆ సంఘం అధ్యక్షుడు గాజుల నర్సయ్య నేతృత్వంలోని ప్రతినిధి బృందం కమిషనర్‌ను కలిసిన వారిలో ఉన్నారు. ఈ సందర్భంగా నర్సయ్య మాట్లాడుతూ... అడిషనల్ క్వాంటమ్ ఆఫ్ పెన్షన్ ప్రకారం 65 ఏళ్ల వారికి 15 శాతం అదనంగా ఒకటో తేదీనే పెన్షన్ చెల్లించాలని కోరారు. అదేవిధంగా రెస్టోరేషన్ ఆఫ్ కమిటెడ్ పెన్షన్ పథకాన్ని పదేళ్లకు కుదించాలని, వైద్య అలవెన్సులు నెలకు రూ.2 వేలు చెల్లించాలన్నారు. మొదటి పే కమిషన్ సూచనల మేరకు ఒక శాతం కంట్రిబ్యూషన్‌తో పరిమితి లేకుండా అన్ని రోగాలకు పథకాన్ని అమలు చేయాలని కోరారు. వేములవాడ, భద్రాచలం, యాదాద్రి ఆలయాలతో పాటు గ్రంథాలయాలు, వాటర్ వర్క్స్, అగ్రికల్చర్-మార్కెట్ కమిటీల్లో పని చేసిన ఉద్యోగులకు హెల్త్‌కార్డులు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. దహన సంస్కార ఖర్చుల కింద రూ.50 వేలు మంజూరు చేయాలని, గ్రాట్యుటీని రూ.20 లక్షలకు పెంచాలని కోరారు. ఫిట్‌మెంట్ 40 శాతం తగ్గకుండా ఇవ్వాలని, ఈ-కుబేరా స్కీమ్‌ను రద్దు చేయడంతో పాటు పెండింగ్‌లో ఉన్న మూడు డీఏలను వెంటనే విడుదల చేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి నవనీత రావు, కార్యనిర్వాహక అధ్యక్షుడు టి.ప్రేమ్‌కుమార్, కోశాధికారి ఇ.శ్రవణ్, గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు హెచ్.రాములు పాల్గొన్నారు.

వార్డుల్లో సెక్షన్ ఆఫీసర్లు కావలెను!

- పెరుగుతున్న ఫిర్యాదులు
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు
- పట్టించుకోని అధికారులు


బజార్‌ఘాట్‌లోని వార్డు కార్యాలయం

నాంపల్లి: మెహిదీపట్నం సర్కిల్-12 పరిధిలోని టౌన్ ప్లానింగ్ విభాగంలో సిబ్బంది కొరత పట్టిపీడిస్తోంది. ఏడుగురు సెక్షన్ ఆఫీసర్లకు గాను ఒక్కరే విధులను నిర్వహిస్తున్నారు. ఈయన కూడా కోర్టు కేసుల చుట్టూ తిరగడానికే సరిపోతోంది. మల్లేపల్లి, విజయనగర్ కాలనీ, ఆసిఫ్‌నగర్, మెహిదీపట్నం, గుడిమల్కాపూర్, అహ్మద్‌నగర్, రెడ్‌హిల్స్ డివిజన్లు ఉన్నాయి. వీటిలో ఒక్కో డివిజన్‌కు ఒకరు చొప్పున సెక్షన్ ఆఫీసర్ ఉండాలి. కానీ నియోజకవర్గానికి మొత్తానికి ఒకే ఒక్కడు సెక్షన్ ఆఫీసర్ ఉండటం చేత ఏరియాలో ఏమి జరుగుతుందో తెలియని దుస్థితి నెలకొంది. గత ప్రభుత్వం ప్రతి డివిజన్‌లో ఒక వార్డు కార్యాలయాన్ని ఏర్పాటు చేసింది. ఈ వార్డు కార్యాలయాల్లో సెక్షన్ ఆఫీసర్లు లేరు. సెక్షన్ ఆఫీసర్లు లేని కారణంగా ఖైరతాబాదులోని సర్కిల్-12 కార్యాలయానికి పరుగులు తీస్తున్నారు.

అగమ్య గోచరంగా టౌన్ ప్లానింగ్ విభాగం..

ప్రస్తుతం కొనసాగుతున్న సెక్షన్ ఆఫీసర్ స్థానిక నివాసి కావడం చేత నాలాలు, చెరువులు, పార్కుల ఆక్రమణలను అడ్డుకోలేక పోతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. సదరు సెక్షన్ ఆఫీసర్ పని ఒత్తిడి కారణంగా తానే సొంతంగా ప్రైవేట్ వ్యక్తులను నియమించుకుని విధులను కొనసాగిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. సర్కిల్-12 టౌన్ ప్లానింగ్ విభాగంలో కొన్నేళ్లుగా ఒకే వ్యక్తి తిష్టవేసుకుని కూర్చోవడం, కింది స్థాయిలో బదిలీలు లేకపోవడం, కొత్త వారిని భర్తీ చేయకపోవడం, కొత్తగా ఎవరైనా వచ్చినా ఇక్కడ పనిచేయడానికి సుముఖత వ్యక్తం చేయకపోవడంతో టౌన్ ప్లానింగ్ విభాగం అగమ్య గోచరంగా తయారయ్యింది. బదిలీలు జరిగినప్పటికీ డీఎంసీ, ఏసీపీ స్థాయిలోనే జరుగుతున్నాయి. కానీ టౌన్ ప్లానింగ్ విభాగానికి కీలకమైన సెక్షన్ ఆఫీసర్ల బదిలీలు జరగడం లేదు. ఇటీవల టౌన్ ప్లానింగ్ విభాగానికి సంబంధించిన ఫిర్యాదులు ఎక్కువగా వస్తున్నాయి. అన్ని డివిజన్లలో అడ్డగోలుగా బహుళ అంతస్తుల భవనాల నిర్మాణాలకు అనుమతులు ఇచ్చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. సర్కిల్-12లో పనిచేస్తున్న ఏసీపీ, సెక్షన్ ఆఫీసర్ అక్రమ నిర్మాణాలను పెద్దగా పట్టించుకోవడం లేదని, తద్వారా బిల్డర్లు యథేచ్ఛగా తమకు ఇష్టం వచ్చిన రీతిలో జీ+2కు అనుమతులు తీసుకుని జీ+6 అంతస్తుల వరకు నిర్మాణాలు చేపడుతున్నారనే అపవాదు వినిపిస్తోంది.

పార్కులు, నాలాలు దురాక్రమణ..?

మెహిదీపట్నం సంతోష్‌నగర్ పార్కు వద్ద ఉండే మురుగునీటి నాలాను ఆక్రమించి బహుళ అంతస్తుల నిర్మాణాలు జరుగుతున్నాయి. అదే నాలా మీద ఓ వ్యక్తి ఇంటినే నిర్మించుకున్నాడు. ఈ నాలా హుడా కాలనీ లే అవుట్ మీదుగా వెళ్తుంది. హుడా కాలనీవాసుల కోసం వదిలిపెట్టిన గ్రీన్ బెల్టును కూడా కబ్జాదారులు వదలడం లేదు. ఈ గ్రీన్ బెల్టుకు కూడా సర్కిల్-12 అధికారులు అనుమతులు ఇచ్చేశారు. అనుమతులు తీసుకున్న బిల్డరు బహుళ అంతస్తుల భవంతి నిర్మాణాన్ని చేపట్టారు. స్థానికులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడంతో ఆసిఫ్‌నగర్ తహసీల్దార్ అక్కడికి వెళ్లికి అక్రమ నిర్మాణంలో నాలుగు రాళ్లు కదిలించి వచ్చారు. అలాగే అహ్మద్ నగర్‌లో పార్కు స్థలాలు, గ్రీన్ బెల్టు స్థలాలు, మల్లేపల్లిలోని బడే మసీదు సమీపంలో నాలాల దురాక్రమణ జోరుగా సాగుతున్నాయి. బజార్‌ఘాట్ అమ్మవారి ఆలయం వెనుకన ఉండే నాలా కనుమరుగు అయ్యింది. నియోజకవర్గంలో ఆక్రమణలు జోరందుకున్నప్పటి వీటిని అడ్డుకునేందుకు సిబ్బంది శక్తి సరిపోవడం లేదు. కాబట్టి టౌన్ ప్లానింగ్ విభాగాన్ని ప్రక్షాళన చేపట్టాలని, సెక్షన్ ఆఫీసర్ల సంఖ్యను పెంచాల్సిన అవసరం ఉంది.

నేడు గరికపాటి ప్రవచన కార్యక్రమం

గన్‌ఫౌండ్రీ: ప్రపంచ ఆర్యావైశ్య మహా సభ తెలంగాణ రాష్ట్ర విభాగం, ఆకృతి సాంస్కృతిక సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో మహా సహస్రవధాని పద్మశ్రీ డాక్టర్ గరికపాటి నర్సింహారావుచే ఈనెల 25న ప్రవచన ప్రభంజనం ఘనంగా నిర్వహిస్తున్నట్లు అఖిలభారత సీఎల్ఐపీ చైర్మన్, ఫ్లాగ్ ఫుట్‌బాల్ టీమ్ ఇండియన్ బ్రాండ్ అంబాసిడర్ కొటిక విఠల్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. 25న శ్రీనగర్ కాలనీలోని శ్రీ సత్యసాయి నిగమంలో స్వీయ పరివర్తనతో విశ్వ పరివర్తన శీర్షికన ప్రవచన కార్యక్రమం ఉంటుందని పేర్కొన్నారు.

మాతృభాష పరిరక్షణకు ప్రత్యేక కార్యాచరణ ప్రకటించాలి


సూరెపల్లి రవికుమార్

అబిడ్స్: మాతృభాష పరిరక్షణకు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ ప్రకటించాలని అంతర్జాతీయ తెలుగుభాష పరిరక్షణ సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు, విద్యావేత్త సూరెపల్లి రవికుమార్ డిమాండ్ చేశారు. తెలుగుభాషను పరిరక్షించేందుకు ప్రతి తెలుగు బాషీయుడు కంకణం కట్టుకుని ముందుకు సాగాలన్నారు. శనివారం తన కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడుతూ..కాంగ్రెస్ ప్రభుత్వం తెలుగు భాషను అభివృద్ధి పరిచేందుకు అంతర్జాతీయ స్థాయిలో ఉన్న తెలుగువారందరినీ ఏకధాటిపైకి తెచ్చి ప్రపంచ తెలుగు భాష వేడుకలు నిర్వహించాలన్నారు. సాహితీవేత్తలకు బస్‌పాస్ ఉచితంగా కల్పించాలన్నారు. కలెక్టర్ కార్యాలయాల్లో ప్రతినెలా తెలుగు సమ్మేళనాలు నిర్వహించి మరింత తెలుగు భాషను అభివృద్ధి పరచాలన్నారు. అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో, వాణిజ్య సముదాయాలు, రోడ్లపై చిరునామాలు, తెలుగులో ఉండే విధంగా జీఓ విడుదల చేయాలని కోరారు.

ఈశ్వరీబాయికి ఘన నివాళి


నివాళులర్పిస్తున్న బుంగ శివకుమార్

చార్మినార్: దివంగత జే.ఈశ్వరీబాయి 33 వర్ధంతిని పురస్కరించుకుని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ ఐక్య వేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు బుంగ శివకుమార్ శనివారం ఆమె విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..సమాజంలోని అట్టడుగు వర్గాల ప్రజల సంక్షేమం కోసం ఈశ్వరీబాయి చేసిన సేవలను కొనియాడారు. మాజీ మంత్రి డాక్టర్ గీతారెడ్డి, మాజీ మంత్రి రాంచంద్రారెడ్డి, ఆల్ ఇండియా ఎస్సీ, ఎస్టీ కాన్ఫిడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మహేశ్వర్‌రాజ్ తదితరులు పాల్గొన్నారని ఆయన తెలిపారు.

అబ్బురపరిచిన సైంటియా సైన్స్ ఎక్స్‌పో


విద్యార్థుల ప్రదర్శనను తిలకిస్తున్న దృశ్యం

గోల్కొండ: శాస్త్రసాంకేతిక రంగాల్లో వస్తున్న మార్పులు, నూతన పరిశోధనలకు అనుగుణంగా విద్యార్థులకు విద్యాబోధన చేయాలని స్పెషల్ మెట్రో పాలిటన్ మెజిస్ట్రేట్ అల్తాఫ్ హుస్సేన్, ఎండీ షా ఆలమ్ జావిద్ అన్నారు. శనివారం మెహిదీపట్నం మురాద్‌నగర్‌లోని రవీంద్రభారతీ పాఠశాలలో సైంటియా సైన్స్ ఎక్స్‌పో జరిగింది. ఈ సందర్భంగా న్యాయమూర్తులు కేజీ నుంచి 10వ తరగతి విద్యార్థుల ప్రదర్శనలను ఎంతో ఆసక్తిగా తిలకించారు. వారు మాట్లాడుతూ.. నేడు ప్రపంచంలో సాధ్యం కానిది ఏది లేదన్న విషయాన్ని విద్యార్థుల ప్రదర్శనలు నిరూపించాయని అన్నారు. కార్యక్రమానికి ప్రత్యేక అతిథిగా హాజరైన ఉస్మానియా యూనివర్సిటీ రిసెర్చ్ సైంటిస్ట్ డాక్టర్ ఎండీ ఖాలీఖ్ మొహియుద్దీన్ మాట్లాడుతూ.. ఈ ప్రదర్శనను తిలకించిన తాను ఎంతో అదృష్టవంతుడినన్నారు. కార్యక్రమంలో మెహిదీపట్నం జోన్ డీన్ ప్రియామనీష్, ప్రిన్సిపాల్ రాజ్యలక్ష్మి, నస్రీన్ ఫాతీమా, డీఐ మధు, విద్యార్థులు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

షేక్‌పేట్ జీఎన్ఐటీఎస్‌లో 'సెలెస్ట్' ప్రారంభం



గోల్కొండ: అంతరిక్ష అన్వేషణలకు సంబంధించిన విషయాలు విద్యార్థులు సులభంగా గుర్తించేందుకు తమ కళాశాల విద్యార్థులకు అండగా ఉంటుందని షేక్‌పేట్‌లోని జి.నారాయణమ్మ ఇంజినీరింగ్ మహిళా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.రమేష్‌రెడ్డి అన్నారు. శనివారం కళాశాలలో విద్యార్థి నిర్దేశిత అంతరిక్ష అన్వేషణ కేంద్రాన్ని (సెలెస్ట్) ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ కేంద్రం ద్వారా విద్యార్థినులు సౌర అన్వేషణ, ఎక్స్‌రే అన్వేషణ, క్వాంటమ్ కమ్యూనికేషన్, అకాడమీ ప్రాజెక్టులపై అన్వేషణలు చేసేందుకు ఈ కేంద్రం తోడ్పడుతుందన్నారు. కళాశాల పూర్వ విద్యార్థినులు ఇస్రో ఆధ్వర్యంలో జరిగిన చంద్రయాన్-3 ప్రయోగంలో పని చేశారన్నారు. విద్యార్థినుల సంకల్పానికి కళాశాల తోడ్పాటు ఉందని ఆయన అన్నారు. కేంద్రం నిర్వాహకులు డాక్టర్ స్వప్న రఘునాథ్ మాట్లాడుతూ.. విద్యార్థినులకు ఉపగ్రహాల తయారీకి కావాల్సిన శిక్షణ, ఐఐఆర్ఎస్ వర్క్‌షాప్‌ల ద్వారా, పరిశోధన వర్క్‌షాప్‌ల ద్వారా అందిస్తామన్నారు.

వయోవృద్ధుల సంక్షేమానికి పాటుపడాలి


స్టిక్కర్లను విడుదల చేస్తున్న నర్సింహారావు తదితరులు

గన్‌ఫౌండ్రీ: వయోవృద్ధుల సంక్షేమానికి పాటుపడాలని తెలంగాణ రాష్ట్ర ఆల్ సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ అధ్యక్షుడు పి.నర్సింహారావు అన్నారు. శనివారం అసోసియేషన్ ఆధ్వర్యంలో వృద్ధులను గౌరవించండి-వేధించడం ఆపండి అనే స్టిక్కర్లను విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. వయోవృద్ధులకు ప్రత్యేక శాఖను ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. తమ ఆస్తిని పిల్లలకు రాసిచ్చి చివరి దశలో అనేక మంది వృద్ధులు దుర్భర పరిస్థితులను ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వృద్ధుల పట్ల అమానుష ప్రవర్తనను మానుకోవాలని కోరుతూ. ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాలతో పాటు పట్టణ కేంద్రాలలో స్టిక్కర్లను అతికిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఆర్.నర్సయ్య, కోశాధికారి జి.కుమారస్వామి, ప్రతినిధులు పి.ప్రతాప్‌రెడ్డి, డాక్టర్ మొగిలిగౌడ్, విజయలక్ష్మి, కె.సావిత్రి, సత్యనారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల భవిష్యత్తుకు ఉపాధ్యాయులు కృషి


మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డితో కరస్పాంటెండెంట్ పుల్లారెడ్డి, విద్యార్థులు

గౌలిపురా: విద్యార్థుల భవిష్యత్తు కోసం ఉపాధ్యాయులు నిరంతరం కృషి చేస్తారని మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి అన్నారు. ఛత్రినాక అయోధ్యనగర్‌లోని విజ్ఞాన్ మోడల్ హైస్కూల్‌లో కరస్పాంటెండెంట్ జి.పుల్లారెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పదో తరగతి విద్యార్థుల వీడ్కోలు సభకు ఆమె ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పుల్లారెడ్డి సబితా ఇంద్రారెడ్డిని ఘనంగా సత్కరించారు. విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలతో విశేషంగా ఆకట్టుకున్నారు. అనంతరం సబితా ఇంద్రారెడ్డి మాట్లాడుతూ..పదేళ్ల కాలంలో తెలంగాణ సర్కార్ హయాంలో విద్యార్థుల చదువుల కోసం ఎంతో కృషి చేశామన్నారు. విద్యార్థులు క్రమశిక్షణతో విద్యాభ్యాసం కొనసాగిస్తే ఆశించిన ఫలితాలు సాధిస్తారన్నారు.

లండన్‌లో సత్తాచాటుతున్న భారతీయ విద్యార్థులు


మాట్లాడుతున్న ప్రొ. జీన్ నియోన్ ఎజింగేర్డ్

సాక్షి, సిటీబ్యూరో: లండన్‌లో భారతీయ విద్యార్థులు అన్ని రంగాల్లో రాణిస్తున్నారని రూహింప్టన్ యూనివర్సిటీ వైస్‌ఛాన్స్‌లర్ ప్రొఫెసర్ జీన్ నియోన్ ఎజింగేర్డ్ కొనియాడారు. హైదరాబాద్ మీడియాపస్ట్ ఆడిటోరియంలో సాన్విరియా ఎడ్యుకేషన్ కన్సల్టెన్సీ ఆధ్వర్యంలో లండన్ విద్యావకాశాలపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..180 ఏళ్ల ప్రాచీనమైన యూనివర్సిటీలో విద్యార్థులు ఎలాంటి చాలెంజెస్‌నైనా ఎదుర్కొనే విధంగా వివిధ కోర్సుల సిలబస్ రూపొందించి విద్యాభాసం అందిస్తున్నట్లు తెలిపారు. లండన్‌లోని టాప్ యూనివర్సిటీల్లో ఒకటని, ఇందులో బిజినెస్ ఆఫ్ లా, స్కూల్‌ఆఫ్ ఆర్ట్స్, స్కూల్‌ఆఫ్ ఎడ్యుకేషన్, హ్యూమానిటీ అండ్ సోషల్ సైన్స్, లైఫ్ అండ్ హెల్త్ సైన్స్, సైకాలజీ కోర్సులు అందిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా సాన్విరియా ఎడ్యుకేషన్ కన్సల్టెన్సీ సేవలకు గాను రాజేష్ గోయల్, సంగీతా గోయల్, కిరణ్ గోయల్‌లకు అవార్డు ట్రోఫీని అందించారు. డైరెక్టర్ రిక్రూట్ మెంట్ అడ్మిషన్ అండ్ ఇంటర్నేషనల్ డెవలప్ మెంట్ ప్రతినిధి జి.రిచర్డ్, ఆక్స్‌ఫర్ ఇంటర్నేషనల్ ఎడ్యుకేషన్ సర్వీస్ మేనేజింగ్ డైరెక్టర్ మోహిత్ గంభీర్, బిజినెస్ డెవలప్‌మెంట్ డైరెక్టర్ విధి మెస్త్రీ పాల్గొన్నారు.

వైభవంగా వినాయక విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవం


వేడుకల్లో రామరాజు, భగవంత్‌రావు

నాంపల్లి: యోగానంద లక్ష్మీ నరసింహ స్వామి ఆలయం (రెడ్‌హిల్స్)లో నూతనంగా వినాయక విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవం వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా నరసింహస్వామి హోమం, చండీహోమం శాస్త్రోక్తంగా చేశారు. శనివారం ఉదయం 9.36 గంటలకు సంగం మఠం స్వామీజీ శ్రీ రాహుల్ బాబాజీ ద్వారా యంత్ర ప్రతిష్ఠాపన, విగ్రహ ప్రతిష్ఠాపన జరిగింది. ఈ కార్యక్రమానికి వీహెచ్‌పీ రామరాజు, భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి ప్రధాన కార్యదర్శి డాక్టర్ భగవంత్‌రావు, సైఫాబాద్ ఏసీపీ సంజయ్‌కుమార్, ఆలయ కార్యనిర్వాహక సభ్యులు ఆంజనేయులు, బాబురావు, సన్నీ, యోగేష్ సింగ్, గిరిధర్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యదర్శిగా వెంకటేశ్



గౌలిపురా: గౌలిపురాకు చెందిన మోకాల వెంకటేశ్ బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యదర్శిగా నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..పార్టీలో పని చేసే వారికి సమయానుకూలంగా గుర్తింపు ఉంటుందన్నారు. తనపై నమ్మకంతో పార్టీ ముఖ్య నాయకులకు తనకు పదవీ అప్పగించడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. తనకు ఈ పదవీ బాధ్యతలు అప్పగించినందుకు ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు ఆనంద్ గౌడ్, మాజీ అధ్యక్షుడు ఆలే భాస్కర్ రాజ్‌లకు ప్రత్యేక ధన్యవాదాలన్నారు.

ఆకట్టుకున్న విద్యార్థుల వైజ్ఞానిక ప్రదర్శన


ప్రదర్శనను తిలకిస్తున్న ఆర్.సంతానం, ఏసీపీ మహ్మద్ గౌస్, వి.వి.ప్రతిభ

సంతోష్‌నగర్: సంతోష్‌నగర్‌లోని రవీంద్ర భారతి పాఠశాలలో శనివారం విద్యార్థులు నిర్వహించిన వైజ్ఞానిక ప్రదర్శనలను విశేషంగా ఆకట్టుకుంది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ ఆర్.సంతానం, సంతోష్‌నగర్ డివిజన్ ఏసీపీ మహ్మద్ గౌస్, ఐపీసీ అధ్యక్షురాలు వి.వి.ప్రతిభలు ముఖ్యఅతిథిగా హాజరై వైజ్ఞానిక ప్రదర్శనను తిలకించారు. అనంతరం విద్యార్థులు ఏర్పాటు చేసిన నమూనాలను పరిశీలించి వారిని అభినందించారు. ఈ కార్యక్రమంలో జోనల్ డీన్ కె.జ్యోతి, డీఐ దయాకర్, ప్రిన్సిపాల్ రుబీనా, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వక్ఫ్ బోర్డు ఆస్తుల పరిరక్షణకు కృషి


అజ్మతుల్లా హుసేనీని కలిసిన మీర్జా అహ్మద్ బేగ్

గోల్కొండ: రాష్ట్ర వక్ఫ్ బోర్డు ఆస్తుల పరిరక్షణ కోసం కృషి చేస్తానని తెలంగాణ రాష్ట్ర వక్ఫ్ బోర్డు చైర్మన్ సయ్యద్ అజ్మతుల్లా హుసేనీ అన్నారు. సీనియర్ మజ్లిస్ నాయకులు మీర్జా అహ్మద్ బేగ్ శనివారం ఆయనను వక్ఫ్ బోర్డు కార్యాలయంలో కలిశారు. వక్ఫ్ బోర్డు చైర్మన్‌గా నియమితులైన ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా అజ్మతుల్లా హుసేనీ మాట్లాడుతూ..వక్ఫ్ బోర్డుకు రాష్ట్ర వ్యాప్తంగా విలువైన ఆస్తులు ఉన్నాయన్నారు. వక్ఫ్ బోర్డుకు సంబంధించిన ఆస్తులు, వాటి వివరాలను మరోసారి సేకరిస్తామన్నారు. అదేవిధంగా రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న వక్ఫ్ బోర్డుకు చెందిన భవనాలు, స్థలాల అద్దెలను సైతం పరిశీలించి అవసరమైతే వాటిని సవరిస్తామన్నారు.

న్యాయ వ్యవస్థపై అవగాహన పెంపొందించుకోవాలి



చాంద్రాయణగుట్ట: న్యాయ వ్యవస్థపై ప్రతి ఒక్కరు అవగాహన పెంపొందించుకోవాలని సిటీ సివిల్ కోర్టు సీనియర్ న్యాయమూర్తి, లీగల్ సర్వీస్ అథారిటీ కార్యదర్శి జస్టిస్ కలార్చన అన్నారు. బండ్లగూడలోని అరోరా న్యాయ కళాశాల ఆధ్వర్యంలో జంగమ్మెట్‌లోని రవీంద్ర నాయక్‌నగర్‌లో శనివారం ఉచిత న్యాయ సేవా సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ..ఎస్టీ, ఎస్సీ, మహిళలకు లీగల్ సర్వీస్ అథారిటీ తరఫున ఉచితంగా న్యాయవాదులను నియమించి న్యాయం జరిగేలా కృషి చేస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫలక్‌నుమా ఇన్‌స్పెక్టర్ ఎస్.రాఘవేంద్ర, అరోరా కళాశాల ప్రిన్సిపాల్ డాలీ గౌతమి, హ్యూమన్ రైట్స్ చైల్డ్ అండ్ ఉమెన్ డెవలప్‌మెంట్ ప్రధాన కార్యదర్శి ప్రతాప్ శాలిని, హైకోర్టు సీనియర్ అడ్వకేట్ కమలాకర్, బస్తీ వాసులు కృష్ణా నాయక్, రాజేష్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

యువకుడిపై కత్తులతో దాడి కేసులో ఐదుగురి అరెస్టు

అబిడ్స్: యువకుడిపై కత్తులతో దాడి జరిపి హత్య చేసేందుకు ప్రయత్నించిన కేసులో ఐదుగురు నిందితులను మంగళ్‌హాట్ పోలీసులు అరెస్టు చేసి వారి నుంచి మూడు కత్తులు, రెండు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. ఇన్‌స్పెక్టర్ రవికుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. టప్పాచబుత్ర కుమ్మరివాడికి చెందిన నిఖిల్‌కుమార్(23) తన స్నేహితుడైన పాతబస్తీ పేట్లబుర్జు నివాసి వినోద్‌గౌడ్ అలియాస్ లడ్డూ వద్ద రూ.80 వేలు అప్పుగా తీసుకొని రూ.60 వేలు తిరిగి చెల్లించాడు. మిగత రూ.20 వేల కోసం వీరి మధ్య గొడవ జరిగింది. దీంతో వినోద్‌గౌడ్ తన సోదరుడు శ్రీకాంత్, స్నేహితులు దీపక్, సోనూసింగ్, ఆకాశ్‌లతో కలిసి ఈనెల 19న నిఖిల్‌కుమార్‌ను బలవంతంగా వాహనంపై ఎత్తుకెళ్లి అప్పర్ ధూల్‌పేట్‌లోని గంగాబౌలీ కొండపై కత్తులతో దాడి చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న మంగళ్‌హాట్ పోలీసులు బాధితుడు ఇచ్చిన స్టేట్‌మెంట్‌ను ఆధారంగా తీసుకుని ఐదుగురు నిందితులను శనివారం అరెస్టు చేశారు.

ఇనుప గ్రిల్స్ ఏర్పాటు

నాంపల్లి: మహవీర్ ఆసుపత్రి ఎదుట రోడ్డుకు అడ్డగా ఏర్పాటు చేసిన సిమెంట్ దిమ్మెలను తొలగించి వీటి స్థానంలో ఇనుప గ్రిల్స్‌ను ఏర్పాటు చేశారు. నిత్యం రోడ్డు దాటుతూ పాదచారులు ప్రమాదాల బారినపడి మృతి చెందుతున్నారంటూ గతంలో 'సాక్షి' వరుస కథనాలను ప్రచురించింది. ఫుట్‌ఓవర్ బ్రిడ్జిని ఏర్పాటు చేయాలని అధికారుల దృష్టికి తీసుకెళ్లింది. స్పందించిన జీహెచ్ఎంసీ ఫుట్‌ఓవర్ బ్రిడ్జిని ఏర్పాటు చేసింది. కానీ చాలా మంది పాదచారులు, రోగులు, ఉద్యోగులు, విద్యార్థులు ఫుట్‌ఓవర్ బ్రిడ్జి వినియోగించడం లేదు. ఈ క్రమంలోనే ప్రమాదాల బారినపడుతున్నారు. వారం రోజుల్లోనే మహవీర్ ఆసుపత్రి ఎదుట రెండు ప్రమాదాలు చోటుచేసుకున్నాయి. ఇందులో ఒకరు మృతి చెందగా మరొకరు కోలుకున్నారు. ప్రమాదాలు తగ్గించేందుకు పాదచారులు రోడ్డును దాటకుండా సిమెంట్ దిమ్మెలను తొలగించి ఇనుప గ్రిల్స్‌ను ఏర్పాటు చేయాలని జీహెచ్ఎంసీ అధికారులకు లేఖలు రాశారు. దీంతో శనివారం బల్దియా సిబ్బంది రోడ్డు మధ్యలో ఉన్న సిమెంట్ దిమ్మెలను తొలగించారు. వాటి స్థానంలో ఇనుప గ్రిల్స్‌ను అమర్చారు. ఇప్పుడు పొడవాటి ఇనుప గ్రిల్స్‌ను పాదచారులు దాటుకునే ప్రసక్తే లేకుండా పోయింది.